క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏపీటీఎఫ్ పనిచేస్తోందని ఉపాధ్యాయులంతా ఏపీటీఎఫ్ సభ్యత్వం పొంది సంఘ బలోపేతానికి సహకరించాలని సంఘ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. మండలంలోని సీఎస్‌పురం, డీజీపేట, దర్శిగుంట్ల, అయ్యవారిపల్లి, శీలంవారిపల్లి, నల్లమడుగుల, అంబవరం, ఆనికాలపల్లి, గుంతచెన్నంపల్లి, కోవిలంపాడు పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఏపీటీఎఫ్ నాయకులు తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనందబాబు, జి.రామకృష్ణ, డి.సుబ్బరాయుడు, కె.చెన్నయ్య, బి.శ్రీనివాసులు, ఎంవీ హేమంత్, ఎం మధుబాబు, బి.రవీంద్ర, చంద్రశేఖర్ పలువురు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

కనిగిరి రూరల్: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడేదే యూటీఎఫ్ అని ఆ సంఘ మండల ప్రధాన కార్యదర్శి పట్నం నరసింహం అన్నారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంను గురువారం మండలంలోని గొల్లపల్లి, దిరిశవంచ, తుమ్మగుంట, పాలవరం, బడుగులేరు, చల్లగిరిగిల్ల ఎడవల్లి గ్రామాల్లో నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఎస్కే ఖాజా రంతుల్లా, నాయకులు బి.మల్లికార్జున, కృష్ణా మూర్తి, మాల కొండారెడ్డి, కొండారెడ్డి, టి.రమణారెడ్డి, ఎం రాము, కాశయ్య, వెంకటరెడ్డి, ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా చేతి పంపులకు మరమ్మతులు



చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తున్న యువకులు

టంగుటూరు: టంగుటూరు మండలం ఆలకూరపాడు పంచాయతీ పరిధిలోని పుల్లారెడ్డి పాలెం కాలనీ వాసులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు ఒక రోజు ఇస్తే మళ్లీ వారం రోజులకు కూడా నీరివ్వకపోతుండటంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ యువకులు అన్నవరపు మనోహర్, పిల్లి కొండలరావు, బత్తుల సుమన్, చల్లాపల్లి తిరుమలరావు, అన్నవరపు రవితేజ మరికొందరు యువకులు ముందుకు వచ్చి తమ సొంత నిధులతో గ్రామంలో ఉన్న చేతి పంపులు మరమ్మతులు చేయించారు. నీటి సమస్య తీరడంతో యువకులను గ్రామస్తులు అభినందించారు.

పండ్ల తోటల సాగు రైతులను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ లలిత

హనుమంతునిపాడు: పండ్ల తోటల సాగుకు ఆసక్తి చూపే రైతులను గుర్తించాలని ఎంపీడీఓ కె.లలిత, ఏపీఓ కె.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఉపాధి కార్యాయలంలో గురువారం ఉపాధి టీఏలు, ఎఫ్ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 ఎకరాలు లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు పండ్ల తోటల సాగుకు జాతీయ గ్రామీణ ఉపాధి నిధుల ద్వారా మంజూరు చేస్తామన్నారు. సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతుల జాబితాను తయారు చేయాలన్నారు. మూడేళ్ల పాటు మొక్కలు బతికేంత వరకు ఉపాధి నిధులు ఇస్తారన్నారు. మామిడి, జామ, నిమ్మ, సపోటా, దానిమ్మ, తోటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఎంపీడీఓ కె.లలిత, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏఓ కృష్ణారావు, ఈసీ గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అమ్మిన కేసులో ముగ్గురికి జైలు

హనుమంతునిపాడు: మండల పరిధి పెద్ద వెంకట్రాయినిపల్లి రెవెన్యూ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను అక్రమంగా అమ్మిన కేసులో మొదటి ముద్దాయితోపాటు సాక్షులుగా ఉన్న ఇద్దరికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై కె.శివనాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పెద్దవెంకట్రాయినిపల్లి రెవెన్యూలో ప్రభుత్వ భూమిని గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన గుర్రం వెంకటక్రిష్ణకు సూరెబోయిన బాలయ్య విక్రయించారు. ఆ కేసులో ముద్దాయిగా ఉన్న ఎస్.బాలయ్యను, అందుకు సాక్షులుగా ఉన్న ఎస్.జయబాబు, కాకర్ల లక్ష్మీబాలనరసింహులను కనిగిరి సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అరెస్టు చేసి కనిగిరి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ముద్దాయిగా ఉన్న సూరెబోయిన బాలయ్యకు, అందుకు సాక్షులుగా ఉన్న ఇద్దరు జయబాబు, కాకర్ల లక్ష్మీబాలనరసింహులుకు 14 రోజులు రిమాండ్ విధించింది. దీంతో ముద్దాయిలను ఒంగోలు జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్సై కె.శివనాగరాజు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య



ఏలూరుపాడులో పాఠశాలలో చేరిన చిన్నారులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు



ఆలకూరపాడులో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

గుడ్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ-2 గోవర్ధన్ అన్నారు. మండలంలోని ఏలూరుపాడులో నేను బడికి పోతాను కార్యక్రమాన్ని ఎంఈఓ ఉపాధ్యాయులతో కలిసి గురువారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎలాంటి భారం పడకుండా స్టూడెంట్ కిట్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. గ్రామానికి కొత్తగా వలస వచ్చి రెండు కుటుంబాలుకు చెందిన ముగ్గురు చిన్నారులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఎంఈఓ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి, కోటేశ్వరరావు ఉన్నారు.

లింగసముద్రం: బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని ఎంఈఓ- 2 శివకుమార్ అన్నారు. మండలంలోని పెదపవని, ముత్యాలపాడు పాఠశాలల్లో గురువారం నేను బడికి పోతా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అమ్మకు వందనం, స్టూడెంట్స్ కిట్స్, ఎండీఎం, పీఎం పోష్టల్‌ను, నాణ్యమైన విద్యను ఉపాధ్యాయుల నుంచి పిల్లలు పొందాలన్నారు. బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించేలా అర్థమయ్యే రీతిలో తల్లిదండ్రులకు వివరించి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ స్థాయి అధికారులు గ్రామాల్లోని బడి ఈడు పిల్లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ కల్పన పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ‘నేను బడికి పోతా’ కార్యక్రమంపై గ్రామ స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ‘నేను బడికి పోతా’ కార్యక్రమం ద్వారా జూలై 12వ తేదీ వరకు ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి బడి బయట ఉన్న 6 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి స్థానిక ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలన్నారు. పిల్లల తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ సుధాకర్ రావు, ఎంఈఓలు రవిచంద్రబాబు, హరిబాబు, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి

టంగుటూరు: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ‘నేను బడికి పోతా’ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీ నుంచి జూలై 12వ తేదీ వరకు 6 నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రతి గ్రామంలో తిరిగి బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ కుటుంబరావు, ఎంఈఓ-2 తన్నీరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్స్, స్టేషనరీ పంపిణీ

కందుకూరు పేదరికంతో ఏ విద్యార్థి విద్యకు దూరం కాకూడదని, అందుకే ప్రభుత్వం అనేక పథకాలను పాఠశాల విద్యార్థుల కోసం అమలు చేస్తుందని ఎంఈఓ కూనం సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కొండముడుసుపాలెం పాఠశాల విద్యార్థులకు దాత మహేష్ సాయంతో నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని దీనిలో భాగంగా నేను బడికిపోతా కార్యక్రమంలో మధ్యలో బడిమానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తామన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పథకాలను వినియోగించి తమ పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. సర్పంచ్ కోటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ మహేష్, గ్రామస్తులు కొండలరావు, ప్రధానోపాధ్యాయుడు దోర్శిల మాల్యాద్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్ బుక్స్ పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఈ పాఠశాలలో తొమ్మిదేళ్ల పాటు సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన కొమ్మాలపాటి శ్రీరామమూర్తి భార్య శోభారాణి జ్ఞాపకార్థం రూ.10 వేల విలువైన రాత పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీరామమూర్తిని అభినందించారు. ఉపాధ్యాయులు డి.శ్రీధర్, సురేష్, పి.వెంకట్రావు, సుబ్బారావు, జ్యోతి, సుభాషిణి, విజయలక్ష్మి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: నేను బడికి పోతా కార్యక్రమంపై కార్యదర్శులు, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, విలేజ్ పోలీసులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షత అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి.పెద్దిరాజు, ఎంపీడీఓ కె.లలిత మాట్లాడుతూ ఇంటింటి సర్వే నిర్వహించి 6 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలను గుర్తించాలన్నారు. ఏఓ కేవీ క్రిష్ణారావు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): విద్యార్థులు పనిలో కాదు బడిలో ఉండాలని ఎంపీడీఓ జలజాక్షి పేర్కొన్నారు. జరుగుమల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ‘నేను బడికి పోతా’ కార్యక్రమంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. బడికి వెళ్లకుండా దుకాణాలు, హోటళ్లలో పనిచేసే వారిని గుర్తించి వారిని తప్పనిసరిగా బడిలో చేర్పించాలని మండల, గ్రామస్థాయి అధికారులకు సూచించారు. జూలై 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎంఈఓ బి.నాగేంద్రవదన్, ఈఓఆర్డీ అంజలీదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీఆర్పీలు, ఐఈఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



టంగుటూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్రమణ్యం



పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ కల్పన



విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేస్తున్న ఎంఈఓ సుబ్బారెడ్డి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ 2 శివకుమార్



జరుగుమల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జలజాక్షి



సమీక్షలో మాట్లాడుతున్న ఎంఈఓ పెద్దిరాజు



ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ

ప్రైవేట్ పాఠశాల తనిఖీ

కందుకూరు: పట్టణంలోని ఒంగోలు ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బుధవారం డిప్యూటీ డీఈఓ ఎంవీవీ ప్రసాదరావు, ఎంఈఓ కె.సుబ్బారెడ్డి తనిఖీలు నిర్వహించారు. విద్యాహక్కు చట్టంలోని 12(1)సి నిబంధన కింద ఎంత విద్యార్థులు చేరారో పరిశీలించారు. మొదటి విడతలో 11 మంది, రెండో విడతలో ఐదుగురు విద్యార్థులు చేరినట్లు గుర్తించారు. ప్రభుత్వ విధానాలను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా ఆచరించాలని, యుడైస్ ప్రొగ్రెషన్ పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పాఠ్య పుస్తకాల కోసం పాఠశాల విద్యార్థుల ఇండెంట్‌లో 5శాతం తప్పనిసరిగా ఆన్‌లైన్ పెమెంట్ ద్వారా అడ్వాన్స్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. తరువాత కేటాయించిన పుస్తక విక్రయ కేంద్రంలో పుస్తకాలు కొనుగోలు చేయవచ్చని వివరించారు. కచ్చితంగా ఇండెంట్ 5 శాతాన్ని అన్ని పాఠశాలల యాజమాన్యాలు రైజ్ చేయాలన్నారు. జీఓ నంబర్ వన్ ప్రకారం ఫీజులు వసూల్ చేయాలని, ఫీజుల వివరాల తెలిపే బోర్డును ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బడిఈడు పిల్లలు ఎవరూ కూడా షాపుల్లో పనిచేయడానికి వీలు లేదని, కచ్చితంగా పాఠశాలలో చేర్పించాలన్నారు. కందుకూరు డివిజన్‌లోని అన్ని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలు నిర్వహిస్తున్నారో లేదో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని స్పష్టం చేశారు.

100 శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలి



గుడ్లూరు సచివాలయం1లో బీసీజీ వ్యాక్సినేషన్ రిజిష్టరు పరిశీలిస్తున్న రమేష్

గుడ్లూరు: 60 ఏళ్లు దాటిన వారికి వేస్తున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని 100శాతం పూర్తి చేయాలని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. మండల కేంద్రమైన గుడ్లూరులోని గ్రామ సచివాలయం-1 వద్ద జరుగుతున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రమేష్ గురువారం పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతమందికి వ్యాక్సినేషన్ వేశారో వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమ, గురువారాల్లో అన్ని గ్రామ సచివాలయాలలో గుర్తించిన వారికి అడల్ట్ బీసీజీ వ్యాక్స్‌న్లు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. 60 ఏళ్లు దాటిన వారంతా ఆరోగ్యవంతంగా ఉండాలన్నదే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వైద్య సిబ్బంది కూడా అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించి ఆగస్టు 15 నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రియంవద, వైద్యాధికారి సాయి ప్రియాంక, సీహెచ్ఓ భాస్కరరావు, హెచ్ఈఓ ఆరీఫ్, ఏఎన్ఎం శ్రావణి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి



కనిగిరి పాఠశాల వద్ద బైఠాయించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

కనిగిరి రూరల్: విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కనిగిరిలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. అధిక ఫీజులతో పాటు, బుక్స్, యూనిఫాం తదితర విద్యా సామాగ్రిని పాఠశాలల్లోనే అధిక రేట్లకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయించాలనే నిబంధనను ఏ ఒక్క విద్యాసంస్థలు అమలు చేయడం లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్, తాహిద్, వంశీ, నారాయణ, నిథిన్, బాష తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనానికి విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

కందుకూరు: కనిగిరి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వాముల అన్నప్రసాద వితరణ భవన నిర్మాణానికి పలుకూరు గ్రామానికి చెందిన కొండూరి కొండూరి వెంకట సుబ్బారెడ్డి, తిరుమల దంపతుల కుమారుడు సురేష్‌బాబు, కోడలు శిరీషలు కలిసి రూ.1,05,116 విరాళాన్ని అందజేశారు. ప్రతి ఏడాది అయ్యప్పస్వాములతో పాటు, వివిధ మాలలు ధరించిన స్వాములకు 40 రోజుల పాటు ఉచితంగా అన్నదానం చేస్తామని, దానికి అనుగుణంగా నూతన భవనం నిర్మిస్తున్న అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. గురుస్వామి కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరశింహ, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి పాల్గొన్నారు.

కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



పారిశుధ్య చర్యలను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో పరిశుభ్రతకు అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా గురువారం పట్టణంలోని ఆర్డీఓ, రెవెన్యూ, కార్యాలయాల సముదాయాల ప్రాంగణంలో పర్యటించారు. ఆ ప్రాంతంలో తక్షణ పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా చిల్ల, పిచ్చిచెట్లను తొలగించారు. మురికినీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో చెత్త, చెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటరీ కార్యదర్శి శాంతి, ఏఎంసీ డైరెక్టర్ చమ్మడిశెట్టి శ్రీనివాసుల నాయుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో టీఆర్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ



సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన టీఆర్‌ఆర్ విద్యార్థులు

కందుకూరు: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం విడుదల చేసిన బీఏ, బీకాం కంప్యూటర్ పరీక్షా ఐదో సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కాలేజీ ప్రిన్సిపాల్ గురువారం తెలిపారు. కామర్స్ విభాగంలో మూడు పేపర్లలో 100శాతం ఫలితాలు, మరో మూడు పేపర్లలో 97శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ పేపర్లో జె.సుస్మిత, ఎన్ బాలనర్సమ్మలు 100కి 92మార్కులు, సర్వీస్ మార్కెటింగ్ పేపర్లో కె.త్రివేణి 100కి 95మార్కులు సాధించి సత్తాచాటారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఈ-కామర్స్, ఆర్డీబీఎస్ పేపర్లో 97శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కంప్యూటర్ అప్లికేషన్ పేపర్లో కె.త్రివేణి 100కి 91 మార్కులు సాధించిందని తెలిపారు. అలాగే స్పెషల్ ఇంగ్లిషు విభాగంలో జి.మౌనిక 100కి 90 మార్కులు, చరిత్ర విభాగంలో ఎస్ కరీముల్లా, డి.ధనుంజయ్ 100కి 92మార్కులు సాధించారని వివరించారు. పొలిటికల్ సైన్స్ 6,7వ పేపర్లో 90శాతం ఉత్తీర్ణత సాధించారని, ఆలూరు ప్రవల్లిక, జి.మౌనికలు 100కి 90మార్కులు సాధించారు. స్పెషల్ తెలుగులో 6,7వ పేపరల్లో 100శాతం, అర్థశాస్త్రం రెండు పేపర్లో 100శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే బి.నరేంద్ర 100కి 90మార్కులు సాధించినట్లు వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ బంగారు భవిష్యత్‌ను అందిస్తుందని తెలిపారు. విద్యతో పాటు ఉపాధి అవకాశాలు అందించడంలోను ముందుందని, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించి, త్వరలో స్వయం ప్రతిపత్తి హోదా సాధించే విధంగా అడుగులు వేస్తుందని తెలిపారు. ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని, కందుకూరు పరిసర ప్రాంత విద్యార్థులు టీఆర్‌ఆర్ కాలేజీలో చేరి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ప్రిన్సిపాల్ రవికుమార్ కోరారు.

పొగాకు రైతులకు అండగా ఉంటా



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, బోర్డు అధికారులు

కందుకూరు: పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆర్ఎం లక్ష్మణరావుతో కలిసి గురువారం పామూరు రోడ్డులోని రెండో వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పొగాకు సాగులో కౌలు, కూలీల రేట్లు, ఇతర ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కంపెనీల ప్రతినిధులు కూడా సానుకూలంగా స్పందించి గిట్టుబాటు ధరలు ఇవ్వాలన్నారు. అనధికారిక పొగాకు కొనుగోళ్లపై కర్ణాటకలో ఎటువంటి అపరాధ రుసుం ఉండదని, ఇక్కడ కూడా అపరాధ రుసం లేకుండా అనధికారిక పొగాకును కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. పంట సాగు పరిమితి విషయంలో రైతులు అధికారుల సూచనలు పాటించాలని, తనకు ఈ రంగంలో అనుభవం ఉందని రైతుల కష్టాలు దగ్గరగాచూశానని వివరించారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ఏ సమస్య వచ్చినా తన దగ్గరకు రావచ్చని సూచించారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మట్టినమూనాలు సేకరించాలి

పీసీపల్లి: మండలంలో అన్ని ఆర్బీకే కేంద్రాల్లో ఉండే వ్యవసాయ సిబ్బంది మట్టినమూనాలు సేకరించాలని ఏఓ వెంకటస్వామి తెలిపారు. స్థానిక ఆర్బీకేలో గురువారం వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దాదాపు 539 మట్టి నమూనాలు సేకరించాలని, అలాగే కౌలుదారులను గుర్తించి వారికి కౌలుకార్డులు అందజేశారు. రైతులు ఆర్బీకేల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఏఈఓ పుల్లయ్య, గ్రామ వ్యవసాయ సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.340



కొండపిలో వేలంలో పాల్గొన్న వ్యాపార ప్రతినిధులు

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో సరాసరి ధర రూ.298.51 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం గ్రామాల రైతులు 1,367 బేళ్లు వేలానికి తీసుకురాగా అందులో 1305 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 62 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర రూ.340, కనిష్ట ధర రూ.205 పలికింది. వేలంలో 26 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, బొంపెద్దుపాడు ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం సీహెచ్.జ్యోతి అన్నారు. మండలంలోని బొంపెద్దుపాడు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గురువారం గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. అంగన్‌వాడీ విద్యపూర్తిచేసుకున్న పిల్లలకు ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎంతో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల ఆవశ్యకతను వివరించారు. వి.రాజశేఖర్, బి.వెంకటేశ్వర్లు, కె.నాగదివ్య, మంగమ్మ, పి.రమణమ్మ, బి.పద్మ, వి.కుమారి, ఆర్.సుభాషిణి, యం.దీప్తి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బొంపెద్దుపాడులో అవగాహన ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కార్యకర్తలు, పిల్లలు